యథేచ్ఛగా మట్టి దందా



చెరువులో నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

- అక్రమంగా తరలిపోతున్న ఒండ్రు మట్టి
- టిప్పర్లు ఏర్పాటు చేసి మరీ తరలింపు

ధన్వాడ: మండల కేంద్రంలోని అక్రమార్కులకు పెద్ద చెరువు వరంగా మారింది. ఇటుకల తయారీకి చెరువులోని ఒండ్రు మట్టిని అక్రమంగా తరలిస్తూ రూ.లక్షలో సంపాదించుకుంటున్నారు. ప్రస్తుతం ఎండకాలం కావడంతో చెరువులో నీరు ఎండిపోవడంతో మళ్లీ మట్టి తరలింపును ప్రారంభించారు. భూముల్లో పోషకాలు పెరిగేందుకు రైతులు చెరువులోని ఒండ్రు మట్టిని తీసుకెళ్లి ఒండ్రుమట్టిని తరలిస్తుంటారు. అయితే మట తరలింపునకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో అనుమతి తీసుకొని మాత్రమే తరలించాల్సి ఉంటుంది. కానీ కొందరు కేటుగాళ్లు పెద్ద చెరువులో సోమవారం నుంచి



చెరువులో నుంచి ఒండ్రు తిస్తున్న జేసిబీ

ఒండ్రు మట్టిని తరలించేస్తున్నారు. గతంలో రెవెన్యూ అధికారులతో నామమాత్రంగా అనుమతులు తీసుకొని మట్టిని తరలించేవారు. ఇప్పుడు ఇరిగేషన్ అధికారులతో అనుమతి తీసుకున్నామని చెబుతున్నా అందులో ఎంత లోతు వరకు తరలించాలి అనే విషయాలపై స్పష్టత లేదు. అధికారులు

> **ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు**
>
> పెద్ద చెరువు నుంచి మట్టి తరలింపునకు తమ కార్యాలయం ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ధన్వాడ పెద్ద చెరువు నుంచి ఎవరైనా ఒండ్రు మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.
>
> – సింధుజా, తహసీల్దార్

తమకు అనుమతులు ఇచ్చారనే సాకుతో 10 టిప్పర్లు, రెండు హిటాచీలను ఏర్పాటు చేసి ఇటుక బట్టీలకు ఒండ్రు మట్టిని యథేచ్ఛగా తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు.

మట్టి తరలింపును అడ్డుకున్న రైతు

రోడ్డును ఏర్పాటు చేసుకొని మట్టిని తరలిస్తుండడంతో రైతు శ్రీనివాస్‌గౌడ్ మట్టి తరలింపును అడ్డుకున్నారు. అధికారులు స్పందించి చెరువులోని మట్టిని తరలించకుండా చర్యలు చేపట్టాలని సదరు రైతు అధికారులను కోరారు.

రైతుల ఆందోళన

రైతులు తమ పొలాలలో వేసుకునేందుకు ఉపాధి హామీలో కూలీలను ఏర్పాటు చేసి రైతులకు అందజేయాల్సి ఉంటుంది. ఇందుకు రైతులు సొంతంగా ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకొని తమ పొలాల్లోకి మట్టిని తరలించునేవారు. కానీ ధన్వాడలో మాత్రం రైతులకు మట్టి తరలింపునకు అవకాశం కల్పించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్



తనిఖీల్లో అడిషనల్ కలెక్టర్ గంగ్వార్

ధన్వాడ: ధన్వాడ మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఐకేపీ ద్వారా కోనుగోళ్లు చేస్తున్న వరి కోనుగోలు కేంద్రాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తనిఖీ చేశారు. వరి కోనుగులు చేసిన తరువాత రైతులకు నగదు రావడం లేదని పలువురు రైతులు ఆయనకు తెలియజేశారు. ఈ విషయంపై నిర్వాహకులను ప్రశ్నించగా ఒక లారీలో ఒక రైతు వడ్లు రైస్‌మిల్లుకు చేరితే వారికి త్వరగా పడుతుందని ఒకే లారీలో 3 నుంచి నలుగురు రైతుల వడ్లు తరలించే క్రమంలో ఒకరికి నగదు జమ కావడంలో కొంత ఆలస్యమవుతున్నట్లు అధికారులు తెలిపారు. అలగే రైతుల వడ్లను తీసుకెళ్లేందుకు లారీకి రూ.5వేలు ఇస్తేనే వడ్లను తీసుకెళ్తున్నట్లు చెప్పడంతో సమస్యను పరిష్కరించాలని సివిల్ సప్లయి అధికారులకు సూచించారు. తనిఖీల్లో తహసీల్దార్ సింధుజాతో పాటు వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

చక్రస్నానంతో ముగిసిన వేడుకలు

నారాయణపేట ఎడ్యుకేషన్: నారాయణపేట షోడషబాహు లక్ష్మీ నరసింహాసహిత రాఘవేంద్రస్వామి దేవాలయంలో మంగళవారం చక్రస్నానంతో నరసింహ జయంతి ఉత్సవాలు ముగిశాయి. ఉత్సవాలలో భాగంగా చివరి రోజు నరసింహ స్వామి ఉత్సవ మూర్తికి చక్రస్నానం చేశారు. హరిదాసుల సంకీర్తనల మధ్య పల్లకీ సేవా నిర్వహించారు. కార్యక్రమంలో శక్తి పీఠ వ్యవస్థాపకులు స్వామి శాంతనంద, రాఘవేంద్ర సేవా సమితి సభ్యులు రఘుప్రేమ ఆచార్య అనిల్ దేశాయి పాల్గొన్నారు.

ఘనంగా కట్టమైసమ్మ బోనాలు

దామరగిద్ద: మండలంలోని ఆశన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామంలో వెలసిన కట్టమైసమ్మ జాతర భోనాలు ఉత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం బోనాలతో వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



ధన్వాడ: జనగాం జిల్లా కేంద్రంలో ఈ నెల 15 నుంచి 18 వరకు జరగనున్న 8వ తెలంగాణ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు స్థానిక కొండాపూర్ గిరిజన గురుకులంలోని నెట్‌బాల్ అకాడమీకి చెందిన 13 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని కోచ్ డాక్టర్ రామ్మోహన్‌గౌడ్ తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో జోగులాంబ జోన్‌లోని మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల జట్ల తరపున విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడం పట్ల ప్రిన్సిపల్ రాజారాం, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ సాంబయ్య, పీఈటీ ఆంజనేయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

నూతన ఇంటి నంబర్ల జారీ

మద్దూరు: నూతనంగా ఏర్పడిన మద్దూరు మున్సిపాలీటి పరిధిలో నూతన ఇంటి నెంబర్లను జారీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. ఇంటి నెంబర్లు లేని వారు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మంగళవారం నూతనంగా ఇంటి నిర్మాణం చేసుకున్న పలువురికి ఇంటి నెంబర్లను కేటాయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో జీపీ పరిధిలో ఉన్న చాలా ఇళ్లకు ఇంటి ట్యాక్స్ జీరో వచ్చిందని వారందరు కార్యా లయంలో దరఖాస్తు చేసుకుంటే దాని పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో



ఇంటి నెంబరును జారీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

మున్సిపల్ సిబ్బంది రామునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ధన్వాడ వాసికి 'కళా కిరిటీ' అవార్డు

ధన్వాడ: ధన్వాడ మండల కేంద్రానికి చెందిన మొల్కమోళ్ల బాలకృష్ణగౌడ్ కళాకిరిటీ అవార్డు అందుకున్నారు. అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి ఏలూర్ జిల్లాలో నిర్వహించిన ప్రపంచ రంగస్థల సంబరాలు, సాహితీ సదస్సులో పాల్గొని పరశురామ ఏకపాత్రాభినయంలో ప్రతిభ కనబరచడంతో ఈ అవార్డు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, తెలుగు భాష పండితులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

రైతుల రాస్తారోకో

మాగనూర్(మక్తల్): మక్తల్ మండలం లింగంపల్లికి చెందిన రైతులు రాస్తారోకో నిర్వహించారు.ఓ విలేకరి క్యూలో రాకుండా తన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మిల్లు నిర్వాహకులతో వారించడంతో వారు ఒప్పుకోలేదు. దీంతో అతను వే బ్రిడ్జి ద్వారా ధాన్యాన్ని కటింగ్ చేస్తున్నారని తూనికల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా అధికారులు వే బ్రిడ్జిను సీజ్ చేసి ధాన్యం కొనుగోళ్లను ఆపేశారు. దీంతో ఆగ్రహించిన రైతులు రాస్తారోకో చేపట్టారు.

వీఆర్ఏ మృతికి సంతాపం



నగదు అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఊట్కూరు: మండలంలోని పులిమామిడి గ్రామంలో వీఆర్ఏ శ్రీనివాసులు (57) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ సూపరిండెంట్ రాఘవేందర్‌రెడ్డి మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. మృతునికి భార్య లలితమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు.

కనులపండువగా నర్సింహస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మాగనూర్: మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రథోత్సవ వేడుకలు కనుల పండువగా జరిగాయి. ముందుగా స్వామివారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వాహించి అనంతరం పల్లకీలో భాజభజంత్రీల నడుమ రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో రథాన్ని అలంకరించారు. రథోత్సవం వేడుక చూసేందుకు మహారాష్ట్ర, కర్ణాటక, హైదారాబాద్, సోలాపూర్ నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి వేడుకను తిలకించారు.

ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక పూజలు

రథోత్సవ వేడుకలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి రథాన్ని లాగి రథోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదే విధంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య, బీఆర్ఎస్ నాయకులు రాజుల ఆశిరెడ్డి తదితర నాయకులు రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహిచారు.

పాల ఉట్ల ఉత్సవం

ఉత్సవాలలో భాగంగా మంగళవారం సాయంత్రం



పాల ఉట్ల స్తంభం ఎక్కుతున్న యువకులు

పాల ఉట్ల ఉత్సవాన్ని నిర్వహించారు. 25 మందికి పైగా యువకులు పాల ఉట్ల స్తంభాన్ని ఎక్కేందుకు పోటీ పడ్డారు. చివరికి గ్రామానికి చెందిన పాలట్ల బులిమేని నరేష్ కంబంపైకి చేరుకున్నారు. ముందుగా గ్రామ పెద్దలు ముందుగా కొంతసేపు చిన్నారులను పాల ఉట్లు ఎక్కించారు. ఈ వేడుక భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

క్లుప్తంగా

ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి చర్యలు



కృష్ణా: మండలంలో ఇసుక అక్రమ తరలింపుపై కలెక్టర్ చర్యలకు ఉపక్రమించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టడానికి విలేజ్ టాస్క్‌ఫోర్స్, మండల టాస్క్‌ఫోర్స్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. విలేజ్ టాస్క్‌ఫోర్స్‌లో గ్రామ పంచాయతీ కార్యదర్శితో పాటు విలేజ్ పోలీస్, ఆర్ఐలు ఉంటారని మండల టాస్క్‌ఫోర్స్‌లో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్ఐ, ఇరిగేషన్ ఏఈలు ఉంటారని ఓ ప్రకటనలో తెలిపారు. కాగా ఈ కమిటీ ఏర్పడిన వెంటనే మండల టాస్క్‌ఫోర్స్ మెంబర్స్ తహసీల్దార్ వెంకటేష్, ఎంపీడీఓ జానయ్య, ఏఎస్ఐ సురేంద్రబాబు, ఇరిగేషన్ ఏఈ అజామ్‌లతో కలిసి కృష్ణానదిలో ఇసుక రవాణాకు వేసిన రోడ్డును పరిశీలించారు. తక్షణమే ఆ రోడ్డును తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు.

హైమాస్ట్ లైట్లకు మరమ్మతు చేయాలి



మరికల్: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో గత 15 రోజుల నుంచి హైమాస్ట్ లైట్లు వెలగడం లేదు. లైట్లు మరమ్మతులకు గురికావడంతో చౌరస్తా ప్రాంతంలో చీకట్లు కమ్ముకున్నాయి. లైట్ల వెలుతురు లేక వాహనదారులు, రోడ్డు దాటే వారు ఇబ్బందులు పడుతున్నారు. లైట్లకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయితీ కార్యదర్శి స్పందించి హైమాక్స్ లైట్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

చెరువులో పూడికతీత పనులు చేపట్టాలి



మాగనూర్: మండల కేంద్రంలోని పెద్ద చెరువు(ఊర)కు వెంటనే మరమ్మతులు చేపట్టాలని మాగనూర్ గ్రామస్తులు మంగళవారం ఇరిగేషన్ ఏఈ భానుచందర్‌కు వినతిపత్రం అందజేశారు. చెరువులో పూడిక పేరుకుపోవడం వలన చెరువు నీరు ద్వారా సాగయ్యే 380 ఎకరాలకు ఒక్క పంటకు మాత్రమే సాగునీరు అందుతుందని తెలిపారు. చెరువులో పేరుకుపోయిన ఒండ్రు మట్టి తరలించి చెరువును లోతుగా మార్చుకుంటే నీటి సామర్థ్యం పెరుగుతుందన్నారు. అదే విధంగా తుమ్ముల మరమ్మతులు లేక నీరు వృథాగా పోతుందని వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఆంజనేయులు, వెంకటయ్య, ఎస్.ఆంజనేయులు, దండు ఆనంద్, గడ్డం నరేష్, వాబయ్య, రమేష్, శంకర్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

దామరగిద్ద: లయన్స్ క్లబ్ సేవలను మండలంలో మరింత విస్తరించేందుకు తమ వంతు కృషి చేస్తామని లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడు శీలం బసిరెడ్డి, కార్యదర్శి, ఎం అశోక్, కోశాధికారి ఊరబావి తిప్పణ్ణ, ఉపాధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు భీమయ్యగౌడ్ సమక్షంలో మంగళవారం మండల కేంద్రంలోని సంజయ్ ఫాంహౌస్‌లో లయన్స్‌క్లబ్ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా, వైద్య, ఆరోగ్య సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

బ్యాంకర్లపై చర్యలు తీసుకోవాలి

నారాయణపేట: రుణాలు మంజూరు చేయకుండా ఖాతాదారులను వేదిస్తున్న జిల్లా కేంద్రంలోని సివిల్ లైన్ ఎస్‌బీఐ బ్రాంచి బ్యాంక్ అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండి సలీం మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహిళా సంఘం సభ్యులకు రుణాలు మంజూరు చేయాలంటే రూ. వెయ్యి చెల్లించి ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవాలని బ్యాంకు అధికారులు వేధిస్తున్నారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం ఎలాంటి ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకోకుండా రుణాలు మంజూరు చేయాల్సి ఉన్నా నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకు అధికారులు ఇన్సూరెన్స్ తీసుకోవాలని మహిళలను ఒత్తిడి చేస్తున్నారన్నారు. దీనిపై తక్షణమే కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రీడలతో బంగారు భవిష్యత్

- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మాగనూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడ శిబిరంలోని విద్యార్థులకు ఎమ్మెల్యే వాకిటి మంగళవారం స్పోర్ట్స్ డ్రెస్‌లు వితరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశం తరపున ఆడుతున్న క్రీడాకారులందరూ పల్లెల నుంచి వచ్చిన వారేనన్నారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులు కూడా దేశస్థాయిలో రాణించి మండలానికి గుర్తింపు తీసుకురావాలని కోరారు. అలాగే డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ ఆంజనేయులు బాల్యం



దుస్తుల పంపిణీలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

విదాభ్యాసం చేసిన పాఠశాలలోనే సొంత నిధులతో వేసవి క్రీడా శిబిరాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆనంద్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, సంజీవ్‌కుమార్ కమాండో, అంబికా బాలు, పీఈడీ రాకేష్ పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మాగనూర్: ఉపాధి హామీ కూలీలు ఎండలను దృష్టిలో ఉంచుకొని పనులకు ఉదయం త్వరగా వచ్చి పనులు పూర్తి చేసుకోపోవాలని ఎంపీడీఓ రహ్మతుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన మాగనూర్ మండల పరిధిలోని అమ్మపల్లిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించి మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు కూడా పనులు చేసేటప్పుడు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పని ప్రదేశాల్లో తాగు నీరుతో పాటు నీడ సౌకర్యం కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి, సీనియర్ మేటి నరేష్ పాల్గొన్నారు.

కార్మిక సమ్మెను విజయవంతం చేయండి

ఊట్కూరు: దేశవ్యాప్తంగా ఈ నెల 20న చేపట్టే కార్మిక సమ్మెను గ్రామీణ హర్తాల్‌లో విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటరామరెడ్డి కోరారు. మండలంలోని నిడుగుర్తి గ్రామంలో మంగళవారం ఆయన కార్మికులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్మిక వ్యతిరేక విధానాలను వారికి వివరించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో ప్రతి కార్మికుడు పాల్గొని మద్దతు తెలుపాలని కోరారు. కార్యక్రమంలో సంఘం



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వెంకటరామరెడ్డి

నాయకులు శంకర్, నారాయణ, అంజప్ప, రాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందజేత

నారాయణపేట: జిల్లాలోని కోస్గి మండలం లోదిపూర్ గ్రామానికి చెందిన వల్సాల్ చెన్నయ్య ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఈ క్రమంలో కుటుంబానికి మంజూరైన రూ.5 లక్షల నష్టపరిహారం చెక్కును విద్యుత్‌శాఖ జేఈఓ ఇన్‌చార్జి మొగులప్ప మంగళవారం కుటుంబసభ్యులకు అందజేశారు. ఇందులో రూ.4.50 లక్షలు నాలుగేళ్ల వరకు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తూ, మరో రూ.50 వేల నగదును డ్రా చేసుకునే విధంగా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో



చెక్కు అందజేస్తున్న విద్యుత్ అధికారి మొగులప్ప

రైతు సంఘం నాయకులు రంగారెడ్డి, ప్రభు తదితరులు ఉన్నారు.

ఫింగర్ ప్రింట్ డివైస్‌తో తనిఖీలు



బస్టాండ్‌లో ఫింగర్ ప్రింట్స్ తీసుకుంటున్న పోలీసులు

కోస్గి రూరల్: కోస్గి బస్టాండ్‌లో పోలీసులు ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో తనిఖీలు నిర్వహించారు. ఇటీవల బస్టాండ్‌లో వరుస దొంగతనాలు జరగడంతో చోరీల కట్టడికి చర్యలు చేపట్టారు. ఈక్రమంలో జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో అనుమానితుల వేలిముద్రలను సేకరించినట్లు కానిస్టేబుల్ అంబయ్యగౌడ్ , విజయ్‌కుమార్ అన్నారు. ప్రయాణికుల మాటునా కొంత మంది వ్యక్తులు రద్దీగా ఉన్న సమయాలలో దొంగతనాలకు పాల్పడుతున్నారని, ప్రయాణికులు బస్సు ఎక్కే , దిగే సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

గుండెపోటుతో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మృతి

మద్దూరు: మద్దూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పనిచేసే అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నీలిబాయి(46) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. నిడ్జింత, క్యాతన్‌పల్లి సెక్టర్లలో పరిధిలో నీలిబాయి(46) గత రెండేళ్లుగా సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మహబూబ్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఆమె సోమవారం అనారోగ్యానికి గురికావడంతో ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు తెలిపారు. అయితే అధికారుల వేధింపులతోనే నీలిబాయి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో, నారాయణపేట జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

వైభవంగా మైసమ్మ జాతర

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారం గ్రామ శివారులో కొరంపల్లి మైసమ్మ జాతర మహోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని చౌడేశ్వరి ఆలయం నుంచి మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలతో ఊరేగింపుగా బయలుదేరి గ్రామ శివారులోని కొరంపల్లి మైసమ్మ ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదలు పంచి పెట్టారు. ఆలయ పునర్నిర్మాణం తరువాత ప్రతి ఏటా మే నెలలో జాతర ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. కార్యక్రమంలో కాట్రే చింతలప్ప, సిద్ధప్ప, ఉషప్ప, అశోక్ కుమార్, జెంగిటి శ్రీనివాస్, బొంబాయి నర్సింహులు, శంకరప్ప పాల్గొన్నారు.



ఆలయం చుట్టూ బోనాలతో ప్రదర్శన చేస్తున్న మహిళలు

సత్యనారాయణస్వామి కల్యాణం

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని శ్రీ సత్యనారాయస్వామి దేవాలయంలో రెండు రోజు జాతర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళవారం స్వామి వారికి పల్లకీ సేవ, శ్రీదేవి, భూదేవి సహిత సత్యనారాయణ స్వామి కల్యాణం అలాగే పంచామృతాభిషేకం, అన్నదాన ప్రసాద వితరణ నిర్వహించారు. ఉత్సవాల్లో డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి పాల్గొని పూజలు జరిపించారు. పూజల అనంతరం ఆయనను ఆలయ నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. ఉత్సవాల్లో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, ఎమ్మెల్యే పీఏ చిట్టెం మాధవరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఈశ్వరాంజనేయస్వామి రథోత్సవం

మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో ఈశ్వరాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున స్వామి వారి



రథం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

రథోత్సవ వేడుకలను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పుర వీధుల గుండా రథోత్సవాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లడంతో గ్రామస్తులు దారి పొడవున మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రథోత్సవం ఉత్సవాలు ముగిసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.